




# కరపత్రం

SINCE 2014

గురువారం మార్చి 20 2025 | సంపుటి :0 | సంచిక : 157 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# రూ. 3,04,965 కోట్లతో

## బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క



తలసరి ఆదాయం
రూ.3,79,751 కోట్లు
రెవెన్యూ వ్యయం
రూ.2,26,982 కోట్లు
మూల వ్యయం
రూ.36,504 కోట్లు



2025-26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 3,04,965 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. అలాగే 2024-25 తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,79,751 కోట్లు కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లుగా ఉంది. మూల వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది ఫిబ్రవరిలో తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసింది. అన్ని సంక్షేమమే తమ ధ్యేయంగా ముందుకు సాగింది. రాష్ట్రంలో రైతులకే కాకుండా ఇతర రంగాల వారికి కూడా అధిక బడ్జెట్‌ను కేటాయించినట్లు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో వెల్లడించారు. మరి ఈ బడ్జెట్‌లో ఏ రంగానికి ఎంత బడ్జెట్ కేటాయించారో చూద్దాం.. 2లో

# కాంగ్రెస్ అసమర్థతతో రైతులకు ఇబ్బందులు

## రేవంత్ కళ్లు తెపిరిపించేందుకు ఎండిపోయిన వరితో వచ్చాం : కేటీఆర్



సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత పాలనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. రుణమాఫీ కాక, రైతుబంధు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణ నదిలో నీళ్ళు సక్రమంగా వాడుకోలేక పంటలు ఎండబెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం, రేవంత్ రెడ్డి కళ్ళు తెరిపించేందుకు ఎండిపోయిన వరితో నిరసన తెలుపుతున్నామన్నారు. సకాలంలో వర్షాలు పడ్డాయని.. కానీ ప్రాజెక్టుల్లో నీళ్లు నింపలేదని విమర్శించారు. 2లో

### 15 నెలలు దాటినా హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీమంత్రి కేటీఆర్ మండిపడ్డారు. సన్నబియ్యం కొంటామని చెప్పి ఇప్పటి వరకు ఆ ఊసే లేదని అన్నారు. ప్రజలకు రేషన్ బియ్యం ఇవ్వడంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో ఏదీ కూడా అమలు జరగడంలేదని.. అన్నింటిలో కటాఫ్‌లే అంటూ ఫైర్ అయ్యారు. 2లో



## రేవంత్‌రెడ్డిపై కేసును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. 2లో

# ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించిన తెలంగాణ ప్రభుత్వం.
- భాజపా పాలిత రాష్ట్రాల్లో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు కాలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శ.
- ఎస్సీల్లో గ్రూప్-1కు 1%, గ్రూప్-2కు 9%, గ్రూప్-3కు 5% రిజర్వేషన్లు కేటాయింపు.
- మందకృష్ణతో వ్యక్తిగత విభేదాలు లేవని, భాజపాను నమ్ముతున్నారని వ్యాఖ్య.



హైదరాబాద్: ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించాం. ఏళ్లుగా వాయిదా పడుతున్న కేసులో బలమైన వాదనలతో అత్యున్నత న్యాయస్థానాన్ని మెప్పించాం. భాజపా ప్రభుత్వాలు ఉన్న చోట కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదు. ఎస్సీ వర్గాలకు నేను సీఎంగా ఉన్నప్పుడైనా న్యాయం చేయాలని బలంగా నమ్మాను. 2లో

## స్మితా సభర్వాల్‌కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం



2 లో

హైదరాబాద్: తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులు తిరిగి యూనివర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనుంది.

# గ్రామీణ రోడ్లకు టోల్‌చార్జీలు..?



హైవేలపై ప్రయాణించేటప్పుడు వసూలు చేసే టోల్ ఛార్జీని.. ఇక నుంచి గ్రామీణ ప్రాంతాల్లో కూడా వసూలు చేసే అవకాశం ఉంది. ఎందుకంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతుంది. రాష్ట్రంలోని రహదారులను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ మోడల్లో 40 శాతం ప్రభుత్వ నిధులతో, 2లో

## తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా



2 లో

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం అవుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఇక ఇవాళ ఉదయం 11.14 గంటలకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గంటా 43 నిమిషాల పాటు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు.?

# సంపాదకీయం

## గోల్వాల్కర్ ఆశయం నెరవేరేనా?

'గురూజీ గోల్వాల్కర్ భారతదేశం ఏకీకృత వ్యవస్థ కావాలని ఆకాంక్షించారు. సమాఖ్య రాజకీయ వ్యవస్థ వల్ల బారతదేశం విచ్ఛిన్నం కావచ్చని ఆయన నిజంగానే భయపడ్డారు. అంతర్గత విభేదాలు, చిన్నచిన్న తగాదాల మూలంగా ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప దేశం వేలాది ఏళ్లపాటు బాహ్య దురాక్రమణలను ఎదుర్కోలేకపోయింది. ఈ కాలంలో దేశ ఐక్యత ప్రమాదంలో పడింది. భాష అనేది ఒక బలమైన భావోద్వేగమైన అంశం. స్వాతంత్ర్యం తర్వాత తమిళ ప్రాంతాల్లో ప్రత్యేక ద్రవిడస్థాన్ కోసం ఉద్యమాలు జరిగాయి. భాషా రాష్ట్రాలు ప్రాంతీయ దురభిమానాలకు దారితీస్తాయని, దాని వల్ల జాతీయ ఐక్యత, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని గోల్వాల్కర్ భావించారు. అయితే హిందీ అనేది ఒక అనుసంధాన భాషయే కాని జాతీయ భాష కాదని, బెంగాలీ, తమిళం, కన్నడ, తెలుగు, మలయాళీ మొదలైనవన్నీ జాతీయ భాషలేనని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం ఒక దేశం కాదని, వివిధ భాషల ఆధారంగా ఉన్న జాతీయతల సమ్మేళనం అనే హానికరమైన సిద్ధాంతాన్ని కమ్యూనిస్టులు సమర్థించారు. స్టాలిన్ మొదట ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం భారత జాతీయతకు ప్రమాదం కలిగించే అవకాశం ఉన్నది.' అని ఆర్ఎస్ఎస్ మేధావి ఎస్‌వి శేషగిరిరావు 'ఒక సిద్ధాంతంతో నా ప్రయాణం' (మై జర్నీ విత్ ఆన్ ఐడియాలజీ) అన్న పుస్తకంలో రాశారు. శేషగిరిరావు చెప్పిన విషయాలు భారతీయ జనతా పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రతిఫలింపచేస్తాయి.

గత శతాబ్దపు తొలి దశాబ్దంలోనే హిందూ జాతీయవాదానికి బీజాలు పడ్డాయనడంలో సందేహం లేదు. వినాయక్ దామోదర్ సావర్కార్ (1883%–%1966), కేశవ్ బలిరాం హెగ్డేవార్ (1889%–%1940), మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ (1906%–%1973) అనే ముగ్గురు సిద్ధాంతకర్తల ఆలోచనా విధానమే బీజేపీకి పునాది అని వేరే చెప్పనక్కర్లేదు. సావర్కార్ రచించిన ఎసెంషియల్స్ ఆఫ్ హిందూత్వ, గోల్వాల్కర్ రచించిన వి ఆర్ అవర్ నేషన్ హుడ్, బంచ్ ఆఫ్ థాట్స్ అనే గ్రంథాల్లో చెప్పిన విషయాలే బీజేపీ, దాని అనుబంధ సంఘాలకు చెందిన లక్షలాది కార్యకర్తలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేశాయి. కులాల ప్రాతిపదికన విడిపోయిన హిందువులు కలిసికట్టుగా ఒకే జాతిగా ముందుకు రావాలని తమ ప్రాచీన జన్మభూమిని బయటివారి కబంధ హస్తాలనుంచి విముక్తం చేయాలని సావర్కర్ తన రచనలో పేర్కొన్నారు. మరోవైపు ఒకేరకమైన సంప్రదాయాలు, ఉమ్మడి భాష, దేశ పూర్వ వైభవం, చరిత్రకు సంబంధించి ఒకేరకమైన స్మృతుల గురించి గోల్వాల్కర్ తన రచనల్లో ఉల్లేఖించారు. ఒకే మూలానికి చెందిన ఒకే సంస్కృతి క్రింద మనుగడ సాధించే జనాభా గురించి ఆయన మాట్లాడారు. ఇటాలియన్ జాతీయవాదనాయకుడు గియుసెప్పె మజిని ఆయనను ప్రభావితం చేశారు. మరాఠీలో మజిని జీవిత చరిత్రను కూడా గోల్వాల్కర్ రచించారు. గత పది సంవత్సరాలుగా నరేంద్రమోదీ ప్రభుత్వం మాట్లాడుతున్న ఒకే దేశం%–%ఒకే ఎన్నికలు, ఒకే దేశం%–%ఒకే గుర్తింపు కార్డు, ఒకే దేశం%–%ఒకే పన్ను, ఒకే దేశం%–%ఒకే పౌరస్మృతి లాంటి పదాల వెనుక ఒక ఆలోచనాధార ఉన్నది. అన్ని రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉండాలనే ఉద్దేశంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయాలని చెప్పినా, మోదీయే అంతటా సర్వాంతర్యామిగా కనపడ్డా, కులగణనను వ్యతిరేకించినా, ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూటమిలో కలుపుకున్నా ఈ ఆలోచనా విధానంలో భాగమే. రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకుంటూ చట్టాలు చేయడం వెనుక ఉద్దేశం కూడా అదే.అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినా, ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహించినా, కాశీ–తమిళ సంగమం అంటూ కార్యక్రమాలను ఏర్పాటు చేసినా ఒకే ఒక సంస్కృతీ ప్రవాహంలో భారతీయులను ఏకం చేయాలనే ఆలోచన తప్ప మరేమీ లేదు. మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రకటన చేస్తూ మహకుంభ్ కేవలం మతపరమైన సమ్మేళనమే కాదని, సమైక్యత, అభివృద్ధి, ఆధ్యాత్మిక జాగృతి దిశగా భారతదేశ ప్రయాణం అన్నారు. మహాకుంభ్ మన జాతీయ చేతన ఎంత గొప్పగా జాగృతం అయిందో స్పష్టం అయిందని ఆయన అన్నారు. అయితే చర్చనీయాంశమైన విషయం ఏమంటే దాదాపు వంద సంవత్సరాల సైద్ధాంతిక భూమిక ఉన్నా, పది సంవత్సరాలకు పైగా మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా దేశాన్నంతటినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకురావడంలోను, ప్రజలందర్నీ ఒకే ఆలోచనా విధానంలో భాగస్వాములను చేయడంలోను బీజేపీ, దాని అనుబంధ సంస్థలు విజయవంతమయ్యాయా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే కొన్ని దక్షిణాది రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా తమిళనాడు నుంచి వస్తున్న ప్రతిఘటనలను చూడాల్సి ఉన్నది. హిందీ భాష , నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులో అన్యాయం లాంటి అంశాలను ఈ రాష్ట్రాలు లేవనెత్తుతున్నాయంటే దానికీ ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. నిజానికి కాంగ్రెస్ కూడా తొలుత దేశ వ్యాప్తంగా హిందీని అమలు చేసేందుకు ప్రయత్నించింది. గాంధీ హిందీ భాషా వ్యాప్తి ద్వారా దేశాన్ని స్వాతంత్ర్య సమరం దిశగా నడిపేందుకు ప్రయత్నించారు. తమిళనాడులో స్వాతంత్ర్యానికి పూర్వమే హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. హిందీని ఇంగ్లీషు స్థానంలో దేశ జాతీయ భాషగా నిర్ణయిస్తూ హోంమంత్రి హోదాలో గుల్జారీలాల్ నందా సర్క్యులర్ జారీ చేసినప్పుడే హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.


GOOD NEWS

ఈ వార్త మీ కాంటాక్ట్ లతో పాటు అన్ని గ్రూపుల్లో షేర్ చెయ్యండి

పుట్టుకతో చెవిటి, మూగ పిల్లల గురించి మీకు తెలిస్తే ఈ శుభవార్తను తెలియజేయగలరు. అటువంటి వారికి ఇప్పుడు అత్యంత అధునాతనమైన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా వినపడేలా మరియు మాటలు నేర్చుకొనేలా చేయవచ్చు.

ఈ అధునాతనమైన సర్జరీకి దాదాపు 10 లక్షల ఖర్చు అవుతుంది. కాని చింతించకండి, ఇప్పుడు ప్రభుత్వం వారి ADIP స్కీమ్ సహాయంతో ఆ సర్జరీ AMRITA ENT HEAD AND NECK HOSPITAL HIG 450, VI Phase, JNTU Hitech City Road, KPHB, HYD - 72. హైదరాబాద్ నందు ఉచితంగా చేయబడుతుంది.

దయచేసి మీ యొక్క గ్రూపులలో షేర్ చేయండి. ఈ అవసరం ఉన్న వారికి సందేశం చేరితే, వారికి జీవితకాల మేలు చేసినవారు అవుతారు.



CONTACT
AMRITA ENT HEAD AND NECK HOSPITAL
JNTU Hitech City Road, KPHB, HYD - 72
Phn: 91 8978152606 / 91 7032255931
040-400117931, 40064008

Dr. Greeshma Pulluri
MS. ENT (Osmania)
Cochlear Implant Surgeon

ధన్యవాదాలు........


# రూ. 3,04,965 కోట్లతో

## బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి

ఏ రంగానికి ఎంత బడ్జెట్?

- రెవెన్యూ విభాగంలో 10,954 గ్రామస్థాయి పోస్టులు
- జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీప్రక్రియ మొదలు
- 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- హాస్టళ్లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంపు
- ఎకరానికి రైతుభరోసా రూ.12వేలు
- రైతు భరోసా: రూ. 18,000 కోట్లు.
- వ్యవసాయ రంగానికి : రూ.24,439 కోట్లు
- రైతుకూలీ సంక్షేమానికి ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద రూ.12వేలు
- సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం
- ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు సబ్సిడీలు
- త్వరలో 14,236 అంగన్‌వాడీల పోస్టుల భర్తీ
- గృహజ్యోతి పథకంతో 50 లక్షల కుటుంబాలకు లబ్ధి
- రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- నియోజకవర్గానికి కనీసం 3500 ఇళ్ల నిర్మాణం
- ఆనుకుని హైదరాబాద్ నాలుగువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- రూ.2 లక్షలలోపు రైతురుణాలు మాఫీ చేశాం
- 25.35 లక్షల మంది రైతులకు 20,616 కోట్లు మాఫీ
- క్రీడలు రూ.465 కోట్లు
- అడవులు.. పర్యావరణం రూ.1023 కోట్లు
- దేవదాయ శాఖ రూ.190 కోట్లు
- హోంశాఖ రూ.10,188 కోట్లు
- చేనేత రూ.371 కోట్లు
- మైనారిటీ సంక్షేమం రూ.3591 కోట్లు
- పరిశ్రమల శాఖ రూ.3527 కోట్లు
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూ.774 కోట్లు
- విద్యుత్ శాఖ రూ.21,221 కోట్లు
- వైద్యం, ఆరోగ్యం రూ.12,393 కోట్లు
- మున్సిపల్ పట్టణాభివృద్ధి 17,677 కోట్లు
- నీటి పారుదల శాఖ రూ. 23,373 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ రూ. 5907 కోట్లు
- పర్యాటక శాఖ రూ.775 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.40,232 కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,169 కోట్లు
- బీసీ సంక్షేమం రూ.11,405 కోట్లు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రూ. 31605 కోట్లు
- మహిళా శిశుసంక్షేమం రూ.2862 కోట్లు
- పశుసంవర్ధక శాఖ రూ.1674 కోట్లు
- పౌరసరఫరాల శాఖ రూ.5734 కోట్లు
- విద్యాశాఖ రూ.23,108 కోట్లు
- మూడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉంది
- కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తుంది
- బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించింది: భట్టి

2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టారు. మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు భట్టి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా.. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సారానికి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాలల్లో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలన రథాన్ని పరుగులు పెట్టించడంతో సఫలీకృతమయ్యామన్నారు. అంబేద్కర్ సూచనలను అనుసరిస్తూ ప్రజాపాలన చేస్తున్నామన్నారు. అధికారాన్ని హోదాగా భావించకుండా ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో విధ్వంస పాలన సాగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తున్నారన్నారు. సొంత మీడియాలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం తమ బాధ్యత అని చెప్పుకొచ్చారు. సమ్మిళిత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్నామని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వరి బోనస్ కింద రూ. 1,206 కోట్లు చెల్లించామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూ. 12,511 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. త్వరలో 14,236 అంగన్వాడీ పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని. విద్యావ్యవస్థ బలోపేతానికి యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని తీసుకొస్తున్నామన్నారు. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని.. కులమతాలతో సంబంధం లేకుండా ఇంటిగ్రేటెడ్ సూళ్లలో బోధన ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండనున్నట్లు తెలిపారు. ప్రతి సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ పథకం అమలులోకి తీసుకొస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం రూ. 11,600 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి భట్టి వెల్లడించారు.

## ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం:

మొదటిపేజీ తరువాయి

సమన్వయం చేసుకుంటూ శాసనసభలో అందరినీ కూడగట్టాం. బిల్లును ఎవరూ వ్యతిరేకించే సాహసం చేయలేదు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా 15 శాతం రిజర్వేషన్లు కేటాయించాం. ఎస్సీల్లో గ్రూప్–1కు ఒక శాతం, గ్రూప్–2కు 9 శాతం, గ్రూప్–3కు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాం. అతి తక్కువ జనాభా కలిగి అభివృద్ధి ఫలాలు ఆశించిన వారిని గ్రూప్–1లో ఉంచాం.

మందకృష్ణతో ఎలాంటి విభేదాలు లేవు

ఎస్సీ వర్గీకరణ తీర్మానం పెట్టాలని 2014లో తెలంగాణ ఏర్పాడ్డాక అసెంబ్లీలో చెప్పా. దీనిపై కేంద్రానికి తీర్మానం పంపాలని కోరాం. తీర్మానం ప్రవేశపెడితే నాతో పాటు సండ్ర వెంకట వీరయ్య, సంపత్‌ను సభ నుంచి బహిష్కరించారు. మేం పెట్టిన తీర్మానాన్ని విధిలేని పరిస్థితుల్లో ఆనాడు సభ ఏకగ్రీవంగా ఆమోదించాల్సి వచ్చింది. అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్తానని ఏనాడూ తీసుకెళ్లలేదు. మందకృష్ణతో ఎలాంటి విభేదాలు లేవు. వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయి. నాకంటే మోదీ, కిషన్‌రెడ్డిని ఆయన ఎక్కువగా నమ్ముతున్నారు. భాజపా ప్రభుత్వాలు ఉన్న చోట ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ అసమర్థతతో రైతులకు ఇబ్బందులు

మొదటిపేజీ తరువాయి

మేడిగడ్డ ఎండబెట్టి సిగ్గులేకుండా ఇసుక అమ్మకాలు చేస్తోందని ఫైర్ అయ్యారు. 36 శాతం కృష్ణ జాలలు వాడుకోంది గత బీఆర్ఎస్ ప్రభుత్వం అని చెప్పుకొచ్చారు. కిందకి నీళ్లు వదిలి చంద్రబాబు మీద ప్రేమతో ఇక్కడ పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. వరి చెళ్ళలో మేకలు గొర్రెలు మేస్తున్నాయన్నారు. దేవాదుల పంపులు ఆరు కోట్లు ఇస్తే నీళ్ళు వదిలే అవకాశం ఉండేదన్నారు. కానీ అందులో కమిషన్ రాదు కాబట్టి అవి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని వ్యాఖ్యలు చేశారు. కాలం తెచ్చిన కరువు కాదు ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ విమర్శలు గుప్పించారు. ఎక్కడెక్కడ లక్షల పంటలు ఎండిపోయాయో ఆ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులు నింపలేని తెలివి తక్కువతనం, పాడైన బ్యారేజ్ రిపేర్ చేయకుండా తెలివి తక్కువతనంతో ప్రభుత్వం సిగ్గులేని చర్యలకు పాల్పడుతోందన్నారు. పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో తాము పర్యటిస్తామన్నారు. ఎకరానికి రూ. 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రేవంత్‌రెడ్డిపై కేసును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. జన్వాడలో డ్రోన్ ఎగురవేసిన ఘటనకు సంబంధించి 2020 మార్చిలో నార్సింగి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. దీంతో రేవంత్‌రెడ్డిని అప్పట్లో నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈక్రమంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనల సందర్భంగా జన్వాడ నిషిద్ధ ప్రాంతమేమీ కాదని రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది పేర్కొన్నారు. తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని చెప్పారు.

కేటీఆర్‌పై నమోదైన కేసు కొట్టివేత

మరోవైపు సైఫాబాద్ పీఎస్‌లో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని కించపర్చే విధంగా మాట్లాడారని.. ఎంపీ అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కేసును కొట్టేయాలని కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు.

వాదనల సందర్భంగా.. బాధ్యత గల హోదాలో ఉన్న కేటీఆర్ ఇష్టారీతిన మాట్లాడారని పీపీ చెప్పారు. సీఎంను కించపరిచే విధంగా మాట్లాడారని పేర్కొన్నారు. మరోవైపు రాజకీయ కక్షలతో కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది అన్నారు. ఇరువైపులా వాదనలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది.

## 15 నెలలు దాటినా హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

సన్న బియ్యం అంటూ ఊదరగొట్టి ఉన్న బియ్యం కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం అంటూ మాజీ మంత్రి ఎక్స్ వేదికగా మరోసారి మాటల తూటాలు పేల్చారు. కొండనాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడింది అన్నట్టు – సన్నబియ్యం కోసం చూస్తే దొడ్డుబియ్యం కూడా ఇయ్యలే అంటూ ఫైర్ అయ్యారు. రైతుల నుంచి సన్నాలు కొన్నది లేదని.. సన్నాలకు బోనస్ రూ. 500 ధర ఇచ్చింది లేదన్నారు. మార్చి నుంచి పేదలకు సన్నబియ్యం అని ప్రకటనలు ఇచ్చి.. పదో తేదీ దాటినా పేదలకు రేషన్ బియ్యం కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వం అని అన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు బుక్కెడు బువ్వ పెట్టని కాంగ్రెస్ సర్కార్.. సామాన్యులకు రేషన్ బియ్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విరుచుకుపడ్డారు. లక్ష 54 వేల మెట్రిక్ టన్నులకు గాను రేషన్ దుకాణాలకు కేవలం 62 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసి ఇందిరమ్మ ప్రభుత్వ చేతులు దులుపుకుందన్నారు. కొత్త ఏడాది ఉగాదికి సన్నబియ్యం అని సన్నాయి నొక్కులు నొక్కి ఉన్న బియ్యం ఊడబీకింది కాంగ్రెస్ ప్రభుత్వమంటూ మండిపడ్డారు. ప్రజాపాలన అంటే పస్తులేనా అని.. ఇందిరమ్మ రాజ్యం అంటే రేషన్ బియ్యం ఎగ్గొట్టుడేనా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశ్నల వర్షం కురిపించారు.

## తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా

మొదటిపేజీ తరువాయి

రూ. 3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ. 2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ. 36,504 కోట్లుగా పేర్కొన్నారు. ఇక అత్యధికంగా ఎస్సీ సంక్షేమానికి రూ. 40,232 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖకు రూ. 24,439 కోట్లు, నీటి పారుదల రంగానికి రూ. 23,373 కోట్లు కేటాయించారు.

## గ్రామీణ రోడ్లకు టోల్‌చార్జీలు..?

మొదటిపేజీ తరువాయి



60 శాతం ప్రైవేట్ డెవలపర్ల పెట్టుబడితో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. హైబ్రిడ్ అన్యూటీ మోడల్‌లో 2028 వరకు 17 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను సుమారు రూ. 28 వేల కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 769.35 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారుల నిర్మాణానికి రూ. 3,725.22 కోట్ల మేర పరిపాలనా అనుమతులు జారీ చేసింది. వీటిలో 55 కి.మీ. పొడవు కలిగిన రహదారులు, 9 వంతెనల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి వీలుగా, ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండేలా రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడైపోయిన రహదారుల మరమ్మతులు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## స్మితా సభర్వాల్‌కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఒకటి రెండు రోజుల్లో ఆమెకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో సీఎంఓలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితా సభర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. నెలకు రూ. 63 వేల చొప్పున అద్దె రూపంలో యూనివర్సిటీ నుంచి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలలకు రూ. 61 లక్షలు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. స్మితా సభర్వాల్ అద్దెకు తీసుకున్న టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో ప్లేట్ వాహనం కాదు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రతి ఎస్సీ కుటుంబానికి అందించాలి

- షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్
- జిల్లా కలెక్టరు గౌతం పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా. కలెక్టరేట్ విసి హాలులో సమీక్ష సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ఉపయోగించుకొని ఎస్సీ వర్గ ప్రజలు సమాజంలో మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకొనెందుకు, ఆర్థిక ప్రయోజనాన్ని పొందేవిధంగా అవగాహన కల్పించాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ జిల్లా అధికారులను ఆదేశించారు.మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు విచ్చేసిన షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునిల్ కుమార్ తో కలిసి కమీషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ హాజరయ్యారు. షెడ్యూల్డ్ కులాలకు హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీలు నిరాదరణకు గురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలు, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం కోసం రూపొందించిన చట్టాల అమలు తీరును కమీషన్ సభ్యులు శాఖల వారిగా సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీ లేని రుణాల పథకాలు ఎస్సీ వర్గాలకు అందేలా ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ప్రభుత్వం అందించే ఎక్కువ సబ్సిడిరుణాల గురించి ఎస్సీ మహిళలకు అవగాహన కల్పించి పారద్శకత పాటిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా స్వయం ఉపాధి కై చిన్న కుటీర పరిశ్రమలు నెలకొలిపేందుకు ఔత్సాహిక యువతను ప్రేరేపించాలని సభ్యులు సూచించారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు మెను చార్ట్ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా అని సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సభ్యులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిపుల ద్వారా జిల్లాలో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందించే స్కాలర్ షిప్పులు ఆలస్యమైనట్లయితే విద్యార్థుల అడ్మిషన్ లలో ఇబ్బంది కలుగకుండా కాలేజీల యాజమాన్యానికి, స్కాలర్ షిప్ ద్వారా ఫీజు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా లేఖలను అందజేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారికి సూచించారు. కేంద్రప్రభుత్వం అందించే పథకాల పై ప్రజలలో అవగాహన లేకుండా పోతుందని,ఈ పథకాల పై ప్రజలలో అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. క్రమం తప్పకుండా బ్యాంకర్స్ మీటింగ్ నిర్వహించి లబ్దిదారులకు రుణాలు అందించే విధంగా లీడ్ బ్యాంక్ మేనేజరు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులలో కుల ధృవీకరణ సర్టిఫికెట్ లేనందువల్ల జాప్యం కలుగకుండా సంబంధిత తహాసీల్దారు ధృవీకరణ పత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు. అట్రాసిటి కేసులలో ఎఫ్ ఐ ఆర్ బుక్ చేసి బాధితులకు అందించే ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను సూచించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా మద్యం దుకాణాలు ఎస్సీ వర్గాలకు కేటాయించిన వాటిని ఎస్సీలకు మాత్రమే అందించాలని, వారు ఇతరులకు అమ్ముకుంటే వారి పై చర్యలు తీసుకోవాలని, ఎస్సీలకు కేటాయించిన వాటిని ఎస్సీలకే అందించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారికి సభ్యులు సూచించారు. అంతకు ముందు జిల్లా లో అమలవుతున్న పథకాలలో ఎస్సీలకు అందించే వివరాల శాతాలను జాబితాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కమీషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ కు వివరించారు. ముందుగా కమీషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునిల్ కుమార్లను జిల్లా కలెక్టరు గౌతం శాలువ, మెమెంటోలతో సత్కరించారు.ఈ సమావేశంలో మల్కాజ్గిరి, మెడ్చల్ డి సి పిలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు శ్యాంప్రకాష్, ఉపేందర్ రెడ్డి, ఎసిపిలు, పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రసమయి బహిరంగ చర్చ సవాల్‌ను స్వీకరించి తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు..

- బెజ్జంకి మండలంలో ఉద్రుతం...
- కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు..



**కరపత్రం శంకరపట్నం మార్చి 19**
మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పై మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ నేత రసమయి బాలకిషన్ సవాళ్లు స్వీకరించి బెజ్జంకి మండల కేంద్రానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ నేతలు బుధవారం తరలివచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన, కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై గత పదిరోజులుగా చేస్తున్న అవాస్తవ ఆరోపణలకు ఆధారాలు చూపించేందుకు, బహిరంగ చర్చకు మాజీ ఎమ్మెల్యే రసమయి రావాలని ఉత్సవాలు విసిరారు. రసమయి బాలకిషన్ పట్టించుకోకపోవడంతో కాసేపటి తర్వాత బెజ్జంకి మండలం గుండారంలో గల మాజీ ఎమ్మెల్యే రసమయి ఫామ్ హౌస్ ముట్టడి కి కాంగ్రెస్ పార్టీ నాయకులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గం లోని, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం ,బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండిలి:



**కరపత్రం రామగిరి ప్రతినిధి మార్చి 19.**
సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని రామగుండం-3 ఏరియా సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు అన్నారు. బుధవారం లద్నాపూర్ గ్రామంలోని సేవా భవన్ నందు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులను సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకరరావు సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం కూడా ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాన్ని సంపాదించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. గతంలో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు, ప్రస్తుతం స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని అన్నారు.కార్యక్రమంలో సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, శిక్షకురాలు స్వప్న, అభ్యర్థులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

- అమృత్ 2.0 లో భాగంగా 41.50 కోట్ల నిధుల మంజూరు...
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా తాళ్లచెరువు నింపేందుకు కృషి...
- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**




కోరుట్ల పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా అమృత్ 2.0 లో భాగంగా కోరుట్ల మున్సిపాలిటీకి 41. 50 కోట్లు మంజూరు కావడం జరిగిందని దీంట్లో భాగంగా బుధవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు కోరుట్ల పట్టణ విలీన గ్రామమైన ఎకిన్ పూర్ పట్టణ శివారులో గల శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పైపులైన్ ద్వారా తాళ్లచెరువు లో నీళ్ళు నింపడం కోసం ఆర్డీవో మున్సిపల్ కమిషనర్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తి కావస్తుందని అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాబోయే ఎండాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహత్తిని తీర్చడం కోసం అమృత్ 2.0 లో భాగంగా కోట్ల రూపాయల నీరు మంజూరు చేయడం జరిగిందని దీనిలో భాగంగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ద్వారా తాళ్లచెరువును నింపడం కోసం రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించడం జరిగిందని ఇందులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఏమైనా నష్టం జరిగితే ప్రభుత్వం ద్వారా అందజేసేలా కృషి కృషి చేస్తానన్నారు కావున రైతులు సహకరించాలని కోరారు అలాగే రాబోయే ఎండాకాలన్ని దృష్టిలో ఉంచుకొని కోరుట్ల పట్టణంలో గల 33 వార్డులకు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రత్యేక నిధుల ద్వారా 33 బోర్లు మంజూరు చేయడం జరిగిందని వాటిని త్వరలోనే వేసేలా కృషి చేస్తామన్నారు అలాగే తాళ్లచెరువు కంచేరకుంట మద్దుల చెరువు లలో త్వరలోనే పూడిక తీయడం జరుగుతుందన్నారు అమృత్ 2.0 లో భాగంగా చేపట్టబోయే పైపుల నిర్మాణం ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చూస్తామని అంతే కాకుండా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు రాబోయే ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని కోరుట్ల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ 2.0 లో భాగంగా ప్రభుత్వం ద్వారా 41.50 కోట్ల నిధులు మంజూరు కావడం జరిగిందని ఇట్లు నిధుల ద్వారా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ద్వారా తాళ్లచెరువును నింపి తద్వారా ఫిల్టర్ బెడ్ ద్వారా పట్టణ ప్రజలకు మంచినీరు అందేలా కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ మున్సిపల్ డిఈ ఏఈ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డిఈ ఏఈ కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజాం మాజి మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ పుప్పాల ప్రభాకర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఎ నయీమ్ నాయకులు అన్నం అనిల్ మచ్చ కవిత మ్యాకల నర్సయ్య ఎంబేరి సత్యనారాయణ సంఘ లింగం జిందం లక్ష్మీనారాయణ మోర్తాడ్ లక్ష్మీనారాయణ శోగ్రాభి సదుల వెంకటస్వామి చిట్యాల లక్ష్మీనారాయణ రియాజ్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్త తదితరులు పాల్గొన్నారు







# సామాజిక తెలంగాణ మా ధ్యేయం

**– కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్:**







**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు బరపట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు తెలియజేస్తూ పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించడం జరిగింది. టపాకాయలు కాల్చి, సీట్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.ఈ కార్యక్రమంలో హాజరైన కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ మాట్లాడుతూ.... భారత్ జూడో యాత్ర ద్వారా దేశంలో ఉన్న బలహీన వర్గాల ఆర్థిక రాజకీయ స్థితిగతులను అధ్యయనం చేసిన రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే అంశాన్ని నిన్న అసెంబ్లీలో తీర్మానించడం సంతోషదాయకమని, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఐటీ శాఖ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ,రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు బీసీ వర్గాల గొంతుక రాజ్ ఠాగూర్ కి ధన్యవాదాలు తెలియజేస్తున్నమని అన్నారు.మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం మాట్లాడుతూ.... దశాబ్దాల కాలంగా ఉన్నటువంటి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో తీర్మానించడం సంతోషదాయకమని ,మిగతా వర్గాలకు కూడా న్యాయం చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తదని, ప్రతి ఒక్క వర్గానికి బహుజన అందరికి అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కూడా దృశ్య సారించి అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులను పార్లమెంటులో ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు.డిసిసి ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.... బలహీనవర్గాలకు అండగా అనునిత్యం నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఒక్కొక్క హామీని నెరవేస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ,శాసనసభ్యులకు పార్టీ నాయకత్వానికి బీసీ వర్గాల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమాన్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం ,మార్కెట్ కమిటీ వైస్-చైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్ ,రెండు మండలాల కో-ఆర్డినేటర్ గాదె సుధాకర్ ,బీసీ సెల్ మండల అధ్యక్షులు బరుపాటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మంతెన మహేందర్ ,సూరి నాయక్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్యామ్, మాజీ సర్పంచులు కనకయ్య, గంగాధరి శ్రీనివాస్ గౌడ్, ఎదులాపురం వెంకటేష్ ,మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్, గజ్జల నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు రాజ్ కుమార్, దారవేణి సాయి ,అప్పల రాజేందర్ ,కాంపెల్లి సంతోష్, గంటసాల బుజ్జి బాబు, ఊపులేటి శ్రీను, ఉప్పులేటి రవి, ఎలిగేటి లింగయ్య, జూల లింగయ్య ,నాగరాజు, మైనార్టీ నాయకులు దస్తగిరి, జలీల్, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్జి 1 ఏరియాలో ఆడిట్ డిపార్ట్ మెంట్ లో అన్యువల్ ఇంక్రిమెంట్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 19:**



ఆర్.జి రీజియన్ లోని అర్జీ.1,2,3, భూపాలపల్లి ఏరియాల ఉద్యోగుల సుమారు 16 వేల మంది ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగుల 2024-25 సంవత్సరంకు సంబందించిన అన్యువల్ ఇంక్రిమెంట్స్ చేయటం, అన్యువల్ ఇంక్రిమెంట్ ను ఆర్జి రీజియన్ ఇంటర్నల్ ఆడిట్ ఫైనాన్స్ మేనేజర్ మోహన్ రావు పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుంది. అన్యువల్ ఇంక్రిమెంట్స్ లను త్వరితగతిన కచ్చితత్వంతో టీం వర్క్ గా చేయటం జరిగుతుంది. అన్యువల్ ఇంక్రిమెంట్ కోసం ఆడిట్ అధికారులు, సుమారు 20 మంది క్లరికల్ సిబ్బంది పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ విద్యా మాధవి, మనిదిప్, ఆడిట్ డిపార్ట్ మెంట్ క్లరికల్ స్టాఫ్ పాల్గొన్నారు.






## పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ల ప్రధానం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 19:**



సింగరేణి హైస్కూల్, సెక్టర్ -2లో పదవ తరగతి పరిక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ చేతుల మీదుగా హాల్ టికెట్లను అందించారు. ఈ సంద్భంగా జియం మాట్లాడుతు మార్చి 21వ తేది పదవతరగతి పరీక్షలకు హాజరు కాబోతున్న 59 మంది విద్యార్థులు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదివి పరిక్షలు మంచిగా రాసి స్కూల్ కు మరియు తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మరియు ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి వెల్లాలని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసే వారు ముంచి పౌష్టిక ఆహరం తీసుకుంటు ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా చదివి మంచిగా పరిక్షలు రాయాలని తెలిపారు. పరిక్షల సమయంలో ఏకాగ్రతతో చదువుతూ పరిక్ష వివరంగా చక్కగా వ్రాయాలని జిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, అధికార ప్రతినిధి దేవరకొండ కిరణ్ బాబు, ప్రధానోపాద్యాయులు బి.శ్రీనివాస్, పాఠశాల అధ్యాపకులు స్వర్ణలత, శశికళ, శ్రీలత, హెప్ సి భా, సుజాత, శోభా రాణి, పూర్ణ చందర్, అధ్యాపక బృందం చిన్నారులు పాల్గోన్నారు.

## సిలువేరి గట్టయ్య కు డాక్టరేట్ పట్టా

**– సన్మానించిన బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి..!**



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కాలేజీలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పెద్దపల్లి జిల్లా, రామగుండం, జ్యోతినగర్ పట్టణానికి చెందిన సిలివేరి గట్టయ్య (గణేష్) లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ లో పిహెచ్డి చేసి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, బిజెపి నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు...

**ఈ సందర్భంగా బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.....**

సిలివేరి గట్టయ్య (గణేష్) లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ లో పిహెచ్డి చేసి డాక్టరేట్ పట్టా పొందడం గర్వకారణంగా భావిస్తున్నామనీ అన్నారు.ప్రొఫెసర్ డా. జె. వివేకవర్ధన్ పర్యవేక్షణలో "హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఇన్ స్పెషల్ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ" అనే అంశంపై విస్తృతమైన పరిశోధనలు పూర్తి చేసి సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేయడంతో వారికి లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పిహెచ్డి పట్టా అందజేయడం జరిగింది అన్నారు.

"సిలివేరి గట్టయ్య గారి విజయం రామగుండం పట్టణానికే గర్వకారణమన్నారు. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ లో ఆయన సాధించిన విశేష విజయం భవిష్యత్తులో మరెందరికో స్ఫూర్తి కలిగించనుందన్నారు."ప్రస్తుత ప్రస్తుత యుగంలో సమాచార వనరులు మరియు లైబ్రరీల ప్రాముఖ్యత పెరుగుతున్న తరుణంలో, సిలివేరి గట్టయ్య గారి పరిశోధన తెలంగాణలోని ప్రత్యేక గ్రంథాలయాల అభివృద్ధికి దోహదం చేస్తుందనీ,ఆయన పరిశోధన ఫలితాలు భవిష్యత్తు గ్రంథాలయ నిర్వాహకులకి, సమాచార వనరుల నిర్వహణకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు....గట్టయ్య గారి విజయాన్ని రామగుండం పట్టణంలోని విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలతో స్వాగతించారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు క్యాతం వెంకటరమణ,తోట కుమారస్వామి, గుండెబోయిన లక్ష్మణ్ మరియు మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్,పల్లికొండ నర్సింగ్, సిలువేరు అంజి, దెబ్బట కమల్ ,గొర్రె రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.






## ప్రాధాన్యతా రంగాలను విస్మరించిన బడ్జెట్

**– నిరాశపరిచిన బడ్జెట్**

**– సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**



2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ను ప్రవేశపెట్టారని, ఈ బడ్జెట్లో ప్రాధాన్యత రంగాలకు తగిన నిధుల కేటాయించలేదని, సిపిఎం పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.3,04,965 కోట్ల బడ్జెట్ ప్రతిపాదిస్తే 2,26,982 కోట్లు రెవెన్యూ వ్యయంగా చూపెట్టారని, మూల ధన వ్యయంగా 36,504 కోట్లు ప్రతిపాదించారన్నారు 6 గ్యారంటీలు అమలుపై నిధుల కేటాయింపులు అరకొరగా కేటాయించారని ఇలా అయితే ఆరు గ్యారెంటీలు అమలు ఎలా సాధ్యమవుతుందన్నారు. ఉత్పాదక రంగమైన వ్యవసాయ శాఖకు 24,439 కోట్లు ప్రతిపాదించారని, వ్యవసాయం దాని అనుబంధ శాఖలకు ఎంత మాత్రం ఈ బడ్జెట్ సరిపోదు అన్నారు.పౌర సరఫరాల శాఖకు కేవలం 5734 కోట్లు కేటాయించారన్నారు. విద్యాశాఖకు కేవలం 23,108 కోట్లు కేటాయించారని బడ్జెట్లో ఇది కేవలం 7.5% మాత్రమే అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే విద్యకు 15% నిధులు బడ్జెట్లో కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలన్నీ నీటి మూటలేనా అన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు కేవలం 12,393 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు.రోడ్లు భవనాల శాఖకు 5907 కోట్లు ప్రతిపాదిస్తే ఉన్న రోడ్ల బాగు కోసమే అవి సరిపోవు అన్నారు. కొత్త రోడ్ల నిర్మాణం ఎలా జరుగుతుందన్నారు.మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పే ముఖ్యమంత్రి క్రీడా శాఖకు కేవలం 465 కోట్లు మాత్రమే కేటాయించడం ఆశ్చర్యకరమన్నారు. ఎన్నికలకు ముందు వివిధ రకాల డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ అందుకు తగ్గట్టుగా ఆయా రంగాలకు నిధులు కేటాయించలేదన్నారు. విద్యా,వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. ఎన్నో ఆశలతో ఎదురుచూసిన జిల్లా ప్రజలకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఈ బడ్జెట్ ను సవరించి ప్రాధాన్యతా రంగాలకు నిధులు పెంచాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.